క్లుప్తంగా

ధాన్యం తరలించుకోండి

ఖానాపురం : రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి ఇతర వాహనాల్లో మిల్లులకు తరలించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బోగ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ సూచనల ప్రకారం.. రైతులకు రవాణా సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఇతర వాహనాల్లో తరలిస్తే రవాణా చార్జీలను అందించనున్నట్లు తెలిపారు. రవాణా చార్జీలను ఆయా కేంద్రాల నిర్వాహకుల ద్వారా చెల్లిస్తారని అన్నారు.

ఎర్రబెల్లి స్వర్ణను కలిసిన కాంగ్రెస్ నాయకులు



వర్ధన్నపేట : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా నియామకమైన ఎర్రబెల్లి స్వర్ణ వరద రాజేశ్వర్‌రావును మంగళవారం వర్ధన్నపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి తన అనుచరులతో ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలబొకే అందించి సన్మానించారు. ఆయన వెంట నాయకులు శ్రీధర్‌రెడ్డి, అశ్విన్, రాథోడ్, సిద్దిక్ ఉన్నారు.

చర్య తీసుకోవాలి

పర్వతగిరి : తాటిచెట్లు నరికిన వ్యక్తిపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు పుల్లూరి సారయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గౌడ కులస్తులతో కలిసి మంగళవారం తాటిచెట్లు నరికిన ప్రాంతాన్ని పరిశీలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నెక్కొండ : మండల కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో గల ప్రాథమిక పాఠశాల(బాలికల) ఆవరణలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి (35) మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని శవ పంచనామా నిర్వహించారు. రైల్వే ట్రాక్ పరిసర ప్రాంతంలో స్క్రాప్ కలెక్ట్ చేసుకొని అమ్ముకొని జీవిస్తున్నట్లు ప్రాథమికంగా తెలిసింది. గుర్తు తెలియని వ్యక్తి గురించి సమాచారం తెలిసిన వారు పీఎస్ నంబరు 87126 85026, ఎస్సై నంబర్ 87126 85236లను సంప్రదించాలని ఎస్సై జానీపాషా పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం..

ఐనవోలు: మండలంలోని వెంకటాపూర్ గ్రామశివారు వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. జఫర్‌గడ్ ఎస్సై శంకర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం వెంకటాపూర్ శివారులోని గోకె రవి తన సొంత వ్యవసాయ బావి వద్దకు వెళ్లి మోటార్ ఆన్ చేశాడు. ఈ క్రమంలో వాసన రావడంతో బావిలోకి తొంగి చూడగా మృతదేహం నీటిపై తేలి ఉండటాన్ని గమనించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బావిలో నుంచి బయటకుతీసి పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతుడు నాలుగు రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని, అతని శరీరంపై గాయాలు ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతుడు నల్ల నెక్కర్, జంజిరం ధరించి ఉన్నట్లు ఎస్సై శంకర్‌నాయక్ తెలిపారు. మృతదేహన్ని గుర్తు పట్టిన వారు సమాచారం అందించాలని ఆయన పేర్కొన్నారు.

సన్మానం

నర్సంపేట : విధి నిర్వహణలో బదిలీలు తప్పవని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ అన్నారు. ఈ మేరకు బదిలీపై వెళ్తున్న సీఎస్ఐ చర్చి ఫాదర్ ఎ.దయాకర్‌ను సోమవారం రాత్రి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వేముల సారంగంగౌడ్, దండెం రతన్‌కుమార్, కటారి ఉత్తంకుమార్, కాంపెల్లి సురేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

పరకాల : స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులకు, ప్రజలకు మరింత అత్యుత్తమ సేవలు అందించాలనే ఆలోచనతో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పరకాల ఆర్టీసీ డిపో మేనేజర్ జీ.కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 11 సంవత్సరాల బాలురకు, 16 సంవత్సరాల బాలికలకు, ఉచిత బస్‌పాస్ సౌకర్యం ఉందన్నారు. స్వాతంత్ర్య సమరయోధులకు, దివ్యాంగులకు, డయాలసిస్ రోగులకు ఉచితం ప్రయాణం సౌకర్యం అందించడం జరుగుతుందన్నారు. పెండ్లిలకు 10 శాతం రాయితీ, ప్రజల సరుకు రవాణా ఒక్క రోజులో చేరవేయడంతో పాటు 20 రోజుల చార్జీతో 30 రోజుల బస్‌పాస్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. బుధవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 99592 26051 నంబర్‌కు డయల్ చేయాలని కోరారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

● ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

నర్సంపేట : కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న మోతె శ్రీలత ప్రమాదవశాత్తు మృతి చెందగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మంజూరైన రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో కార్యకర్తల కుటుంబాల్లో ఏదైనా జరగరానిది జరిగితే వారి కుటుంబ సంక్షేమంపై ప్రభావం పడొద్దని, బీఆర్ఎస్ పార్టీలో సాధారణ సభ్యత్వం, క్రియాశీల సభ్యత్వం తీసుకున్న సభ్యులు ఎవరైనా ప్రమాదవశాత్తు మృతి చెందిన ఆ కుటుంబానికి ఆర్థిక భరోసాను కల్పించడం జరిగిందన్నారు. ఎలాంటి పైరవీలు లేకుండా కేవలం సభ్యత్వం తీసుకున్న అన్ని కులాలకు చెందిన కార్యకర్తలకు లాభం పొందే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, సర్పంచ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు, క్లస్టర్ బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

నెక్కొండ మండలానికి చెందిన మాజీ ఎంపీటీసీ చల్లా నాగిరెడ్డి, నెక్కొండ 11వ వార్డు సభ్యుడు బండారి రమేష్‌యాదవ్ బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం వారికి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నూతన భవన నిర్మాణానికి భూమి పూజ..

నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో నర్సంపేట నియోజకవర్గంలోని సీనియర్ సిటిజన్స్, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వారికి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నూతన భవనాన్ని మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మంగళవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, క్లస్టర్ బాధ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, రిటైర్డ్ ఎంప్లాయీస్ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



నల్లబెల్లి: క్షీరాభిషేకం నిర్వహిస్తున్న జేపీఎస్‌లు



సంగెంలో..

నల్లబెల్లి : జేపీఎస్‌లను క్రమబద్ధీకరిస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కూచన ప్రకాశ్, శ్రావణ్, యాదగిరి, సంతోష్, జ్యోతి, అనిత, అఖిల పాల్గొన్నారు.

సంగెంలో..

సంగెం : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజ్ ప్రక్రియపై ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలమైన నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జేపీఎస్‌ల సంఘం అధ్యక్షుడు కన్నెబోయిన రమేష్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కళావతి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓ కొమురయ్య, ఏపీఓ లక్ష్మి, ఏపీఎం కిషన్, సీనియర్ పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న చైర్‌పర్సన్ గుంటి రజని

నర్సంపేట: నర్సంపేట పట్టణంలోని 11వ వార్డులో రూ.30లక్షలతో నిర్మించ తలపెట్టిన జంతు సంరక్షణ కేంద్రం(యనిమల్ కేర్ సెంటర్), 6వ వార్డులో మోడల్ వైకుంఠధామానికి వెళ్లే మెటల్ రోడ్డు పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్ మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహకారంతో నర్సంపేట పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలను విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట : రాష్ట్రవ్యాప్తంగా రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిర్రు రాజు పిలుపునిచ్చారు. మండలంలోని అంబేద్కర్ నగర్‌లో యువకులకు మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో పాల్గొనే యువతకు ప్రోత్సాహక బహుమతులతో పాటు యూత్ డిక్లరేషన్ విజయవంతం చేయడం కోసం గ్రామ గ్రామాన ప్రచారం చేసే విధంగా కార్యచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ మహిళ టాపర్లకు ప్రత్యేక బహుమతిగా ఎలక్ట్రికల్ స్కూటర్లు అందిస్తారని తెలిపారు. ఆసక్తిగల వారు 76618 99899 నంబర్‌కు ఎస్ఎంఎస్, మిస్డ్ కాల్ ఇవ్వాలన్నారు. జూన్ 17 చివరి తేదీ అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోకుల ప్రవీణ్, ఇల్లందుల అనిల్, మునగాల రాజు, జనగాం సృజన్, బరిగెల దిలీప్, ప్రమోద్, రమేష్, మహేష్, వంశి, సుజిత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

చెన్నారావుపేట : మండలంలోని ఖాదర్‌పేట మీదుగా గొల్లపల్లి, కోరంకుంట తండా వరకు బీటీ రోడ్డు పనులను మంగళవారం వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ జక్క అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు గ్రామాల ప్రజల చిరకాల కోరికను ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నెరవేర్చడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యులు మహ్మద్ రఫీ, సర్పంచ్ కుండె మల్లయ్య, అనుముల కుమారస్వామి, బానోత్ రమేష్, ధరావత్ కిషన్, ఎంపీటీసీలు ధరావత్ శ్రీను, సునీత, సాయిలు, ఉపసర్పంచ్ కొన్కటి రాజు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో 'పల్లె దవాఖానా'



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

నెక్కొండ : పల్లె దవాఖానాలో 12రకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అలంకానిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని అలంకానిపేట పీహెచ్‌సీ పరిధిలోని పెద్దకొర్పోలు పల్లె దవాఖానాలో మంగళవారం నిర్వహించిన జన ఆరోగ్య సమితి సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. వేసవిలో ప్రజలు తీసుకోవల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ మహ్మద్ మైబూబ్‌పాష, పల్లె దవాఖానా వైద్యురాలు సుధ, ఉప సర్పంచ్ పరుపాటి ఇంద్రసేనారెడ్డి, వీటీఏ రమ్యసుధ, ఏఎన్ఎం కరుణ, ఆశ కార్యకర్త జ్యోతి, గ్రామస్తులు, తదితరులు, పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయం



నల్లబెల్లి: విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, మహిళలు, భక్తులు



నల్లబెల్లి : పూజలు చేస్తున్న వేదపండితులు



సంగెం: ఎల్గూర్ రంగంపేట శివాలయంలో..

నల్లబెల్లి : శివనామ స్మరణతో నల్లబెల్లి శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం మార్మోగింది. రాజరాజేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం మొదటి రోజు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు గంగా ప్రసాద్ శర్మ బృందం ఆధ్వర్యంలో గణపతి, వాస్తు, యోగశాల ప్రవేశ ద్వారా, అఖండ దీపస్థాపన, దేవతామూర్తులకు పూజలను నిర్వహించారు. అనంతరం దేవత మూర్తుల విగ్రహాలను ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు ఊరేగింపు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, ప్రజా ప్రతినిధులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా హోమం

సంగెం : మండలంలోని ఎల్గూర్‌రంగంపేట చెరువు సమీపంలో శివాలయ పునర్నిర్మాణ యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ పూజలు రెండో రోజు ఘనంగా నిర్వహించారు. మంగళవారం అమ్మవారి పూజ, పుణ్య దంపతులచే హోమం, విగ్రహాల జలాధివాసంను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'సాల్మన్ రాజుకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలి'

నల్లబెల్లి : తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ స్టేట్ సెక్రటరీ గోనె సాల్మన్ రాజుకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని నల్లబెల్లి పాస్టర్ ఫెలోషిప్ డివిజన్ కన్వీనర్ శంకరయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆ సంఘం మండల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాస్టర్ ఫెలోషిఫ్ మండల కమిటీ ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం అందించి అండగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో మత్తయ్య, అహరోన్, రూబీన్, మనోహర్, శ్రీనివాస్, సాంసంగ్, సాల్మన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం



సీసీరోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమేష్ తదితరులు

మడికొండ : గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ మడికొండలో పలు అభివృద్ధి పనులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రతీ ఇంటికి ఏదో ఒక పథకం అందిస్తోందన్నారు. ప్రతి ఒక్క కుటుంబానికి లబ్ధి చేకుర్చడమే బీఆర్ఎస్ పార్టీ ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా మడికొండలోని పోశమ్మ దేవాలయం వద్ద, మడేలయ్య ఆలయం వద్ద రూ.50లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి, 45వ డివిజన్ కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, జానపట్ల సారయ్య, బొల్లికొండ రవీందర్, వెన్నమల్ల రమేష్, గుంజ రవి, మినుగు సతీష్, ఏపీ ప్రశాంత్, బోగి లింగమూర్తి, బండారి మహేందర్, మూర్తి, నార్లగిరి కుమారస్వామి, మున్సిపల్ అధికారులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



నెక్కొండ: సాయం అందజేస్తున్న స్నేహితులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లి గ్రామపంచాయతీ కార్మికుడు మల్లేష్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి సర్పంచ్ మండల రవీందర్, దేశిని మనోజ్ మంగళవారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబీకులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు.

చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి సాయం

నెక్కొండ : మండల కేంద్రానికి చెందిన కొడారి అశోక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా నెక్కొండ జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి (1996-97) చిన్ననాటి స్నేహితులు మంగళవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం రూ. 25వేల నగదుతోపాటు క్వింటా బియ్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ నబి, బీరం అశోక్, గంట శ్రీనివాస్, శ్రావణ్, మధుసూదన్, సాధిక్, దుండి రాజు, గడ్డం అశోక్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్‌కు చెందిన మహమ్మద్ అంకూస్, పరికి మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా బాధిత కుటుంబాలను పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్, పీసీసీ సభ్యుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

చెరువులో మట్టి తోడుకోవచ్చు

● ఉప్పరపల్లి గ్రామసభలో తీర్మానం
● రైతుల ప్రయోజనాలు పట్టించుకోలేదని ఆరోపణలు



నీరులేని ఎల్లమ్మ చెరువు

వర్ధన్నపేట : రైతులకు ఉపయోగపడే సాగునీటిని వదిలేసి అధికారుల సిఫారసు లేఖల ప్రకారం నల్లమట్టిని తోడుకోవచ్చని గ్రామసభ తీర్మానం చేయడంపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని ఉప్పరపల్లి ఎల్లమ్మ చెరువులో కెనాల్ నీరు రావడంతో పూర్తిగా నిండిపోయింది. దీంతో నీరు ఉంటే నల్లమట్టి తీసుకుని అమ్ముకునేదెలా అని మట్టి మాఫియా ప్రజాప్రతినిధులతో కలిసి నీటిపారుదల శాఖ సిఫారసు లేఖల సారాంశంలో భాగంగా నల్లమట్టి కోసం ఏకంగా నీటిని 20 రోజుల క్రితం తూము ద్వారా వదిలేసి చెరువును ఖాళీ చేశారు.

ఇటుకల తయారీకి..

ఇటుకల తయారీకి చెరువులోని నల్లమట్టి నాణ్యతగా ఉండడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దీంతో ఒక్కో టిప్పర్‌కు రూ.15 వేల నుంచి రూ.20 వేలు పలుకుతోంది. దీంతో నామమాత్రంగా రాయల్టీ చెల్లించి విలువైన మట్టిని విక్రయించి లక్షలాది రూపాయలు వెనుకేసుకుందామనే వారి కల ఫలించింది. సమీపంలోనే వరంగల్ నగరం ఉండడంతో ఇటుక బట్టీలకు ఈ నల్లమట్టి తరలించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

గ్రామసభలో ఇద్దరికి ఇవ్వడానికి తీర్మానం

నీటి పారుదల శాఖ డీఈఈ పేర గత నెల 24న ఎల్లమ్మ చెరువు మట్టి తవ్వుకోవడానికి చిలువేరు పవన్‌కుమార్, గాదెపాక రవి పేర అనుమతి కోరారని గ్రామ సభ తీర్మానం చేసి తమ కార్యాలయానికి పంపిస్తే అనుమతి మంజూరు చేస్తామని లేఖలో సారాంశం. మంగళవారం ఉప్పరపల్లి గ్రామ పంచాయతీలో గ్రామసభ తూతూమంత్రంగా ఏర్పాటు చేసి ఎట్టకేలకు వారికి అనుమతి ఇవ్వడం కొసమెరుపు. దీంతో పది రోజుల క్రితం 'సాక్షి'లో వచ్చిన కథనాలు నిజమని నేడు రుజువైంది.

ఈ వ్యవహారంలో ఎవరెవరు కుమ్మక్కైనట్లు?

నల్లమట్టి వ్యవహారంలో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇందులో రెవెన్యూ, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ అధికారుల అనుమతి లేకుండా నల్లమట్టిని తీసుకోవడం సాధ్యం కాదు. అదే విధంగా చెరువులోని నీరు ఖాళీ చేసే అధికారం సైతం లేదు. అయినా నిండా ఉన్న చెరువును ఖాళీ చేయడం, రైతులు మొత్తుకున్నా పట్టించుకోకపోవడంతో ఇందులో ఎవరి పాత్ర ఎంత ఉంది అనేది ఉన్నతాధికారులే వెలికి తీయాలని, తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అత్యవసర గ్రామసభ అన్నారు



మంగళవారం మైక్‌లో అత్యవసర గ్రామసభ అని ప్రకటించారు. చెరువులోని నల్లమట్టిపై అని మాకు చెప్పలేదు. గ్రామంలో చెరువు విషయం అని ఎవరికి తెల్వదు. ఇంత అన్యాయం ఉంటుందా..

\- పొంతం మధు, ఉప్పరపల్లి

పంట ఎట్లా పండుతది



నిండుగా ఉన్న ఎల్లమ్మ చెరువును ఖాళీ చేశారు. పంట పండేదెట్లా.. వానలు కురవాలి, నార్లు పోయాలి, పంట పండుతదా అన్న నమ్మకం లేకుండా పోయింది. చెరువులో నీరు ఉన్నప్పుడు ఎంతో ధైర్యం ఉండే.. ఖాళీ కాగానే ఆశలు అడియాసలు అయ్యాయి.

\- సంపత్‌రావు, ఉప్పరపల్లి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బహుమతులు అందజేస్తున్న అనితారెడ్డి

హన్మకొండ అర్బన్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పర్యావరణాన్ని కాపాడకపోతే రానున్న కాలంలో మనుషుల మనుగడ కష్టంగా ఉంటుందని డాక్టర్ అనితారెడ్డి, ఈఈ సునీత అన్నారు. మంగళవారం బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో మానవపాత్ర అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్ విజిలెన్స్ మానిటరింగ్ మెంబర్ డాక్టర్ అనితారెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సునీత ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం, చెట్లను నరకడంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ సుభాష్, మల్లికాంబ నిర్వాహకురాలు బండ రామలీల, సదానందం, కోడం కళ్యాణ్ పాల్గొన్నారు.

బీరు బాటిళ్లల్లో ఫంగస్



వర్ధన్నపేట : ఎండలు మండుతున్నాయి.. చల్లటి బీర్లు తాగుదామని యువకులు వైన్ షాపుకి వెళ్లి బీరు బాటిళ్లు కొనుగోలు చేశారు. తీరా తాగుదామని చూస్తే అందులో ఫంగస్ ఉండడంతో ఒక్కసారిగా కంగుతిన్నారు. వర్ధన్నపేట మండలంలోని రేణుక ఎల్లమ్మ వైన్స్‌లో మంగళవారం కొందరు యువకులు మూడు బీరు సీసాలు కొనుగోలు చేశారు. బీరు బాటిళ్లు తెరిచే ప్రయత్నం చేస్తుండగా వారికి అనుమానం వచ్చి చూడగా బాటిళ్లలో ఫంగస్ ఉంది. దీంతో ఆ యువకులు షాపు యాజమాన్యంతో మాట్లాడితే వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని వాపోయారు. షాపు యజమానులు ఇంత నిర్లక్ష్యంగా అమ్ముతున్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిన్నారని మందుబాబులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.